# నేను సీతను కాను

పెళ్ళిళ్ళు స్వర్గంలో జరుగుతాయనేది అందరి నమ్మకం. సృష్టికర్త ఒక జంటను దివిలో ముందే ఒకటిగా చేస్తే, అది భువిలో పెళ్ళిగా సాగుతుందని భావిస్తారు. ఉద్వేగం, ఆనందం, ఆతృత, కాస్తంత భయం, ఊరట, విశ్రాంతి వంటి ఎన్నో భావాలు ఉక్కిరి బిక్కిరి చేస్తుండగా స్త్రీ పురుషులు ఇద్దరూ కలిసి జీవితాన్ని గడప డానికి ఒకటవుతారు. ఇద్దరూ కలిసి జీవితాన్ని ఒకరిలో ఒకరు మమేకమై కలకాలం దాంప త్యం కొనసాగిస్తేనే వివాహబంధానికి సార్థకత.

అలా కాకపోతే -

"పెద్ద చదువులు చదువుకున్నవాళ్ళకి పెళ్ళి చూపులు ఎందుకండీ - అన్నారు. కానీ జయ శ్రీ, విజయ్‌లు మల్టీనేషనల్ కంపెనీల్లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్స్‌గా పనిచేస్తున్నా, ఐదు అంకెల జీతా లు తెచ్చుకుంటున్నా, వారి పెద్దలకు ఆనవాయి తీలను రద్దు చేసే ధైర్యం లేక, సాదాసీదాగా బంధువుల సమక్షంలో పెళ్ళిచూపులు ఏర్పాటు చేసారు.

జయశ్రీని చూడగానే విజయ్ ఏకాంతంగా మాట్లాడాలన్నాడు.

"మీరు నాకు నచ్చారు. నేను మీకు నచ్చితే పెద్దవాళ్ళు వ్యవహారాలు మాట్లాడుకుంటారు" అన్నాడు విజయ్.

"పెద్ద వాళ్ళ వ్యవహారాలు అంటే -" జయ శ్రీ అడిగింది.

"పెద్దవాళ్ళ వ్యవహారాలు అంటే కట్నం, లాంఛనాలు, వగైరాలు... అఫ్‌కోర్స్... అవంటే నాకు ఇష్టం లేదనుకోండి - "

"పెళ్ళికాని అబ్బాయిల్లో ఇదో గొప్ప హిపో క్రసీ. చాలా స్టయిల్‌గా ఉంటుంది వినేవాళ్ళకి. కానీ అమ్మాయితండ్రికి గుండెల్లో గుబులు పుట్టి స్తుంది" అంది.

"మరి మనం బ్రతికే సమాజంలో అనాది గా వస్తున్న ఫార్మాలిటీస్‌ని వదులుకోలేం కదం డీ-"

"అవన్నీ ప్రక్కన పెట్టండి. ముందు మనసు విప్పి మాట్లాడుకోవాలి"

"చెప్పండి..."

"నేను చిన్నతనం నుంచీ సోషల్‌గా ఉంటా ను. ఎక్కువగా మాట్లాడతాను. స్నేహానికి ఎక్కు వ విలువనిస్తాను. నాకు ఉన్న స్నేహితుల్లో మగ వాళ్ళు కూడా ఉన్నారు. ఇది మీకు ఓపెన్‌గా చెప్పాలి" అంది.

ఆమె మాటలు విని విజయ్-

"స్నేహానికి ఎల్లలు, జాతి, మత, కుల, ఆడ, మగ భేదాలు లేవు కదండీ... నాకేం అభ్యంతరం లేదు' అన్నాడు. మగ స్నేహితులు ఉన్నారని ఆమె అనగానే విజయ్ మగ గుండె లో ముల్లు గుచ్చుకుంది. కానీ నెలకు ముప్పై వేల రూపాయలు సంపాదించే అమ్మాయిని

**కె.బి.కృష్ణ**

కథా నిలయం
శ్రీకాకుళం



దృష్టిలో ఉంచుకుని ఆ ముల్లుని పీకి పారేసాడు.

"సో... పెళ్ళయ్యాక నా వ్యక్తిత్వానికి భంగం కలగనంతవరకూ నేను ఎవరినైనా భరిస్తాను. భర్త అయినా సరే... స్వారీ చేస్తే ఊరుకోను"

ఆమె మాటలు మళ్ళీ పిడిబాకులాగుచ్చుకున్నాయి విజయ్ మనసుకు. కానీ మళ్ళీ ఆమె నెలసరి సంపాదనే గెలిచింది.

తరువాత విజయ్ పెద్దవాళ్ళు, జయశ్రీ తండ్రీ మాట్లాడుకున్నాక వివాహం అయిపోయింది.

హనీమూన్ ఊటీ, కొడైకెనాల్, ముస్సోరి వగైరాలలో తమ జీవితపు తొలి సమాగపు మధురిమలను చవిచూసారు. వాటి తీపి గుర్తుగా జయశ్రీ తల్లి అయింది పండంటి బాబుకి.

"బాబు అచ్చు తండ్రి పోలికే..." అంది విజయ్ తల్లి.

"కాదు... మా అమ్మాయి పోలికే. మగపిల్లలకు తల్లి పోలిక వస్తే చాలా అదృష్టవంతుడవుతాడట. మా మనవడు అమెరికాలో ఇంజినీర్ చేస్తాడు" అంది జయశ్రీ తల్లి.

"ఎవరి పోలికైతేనేం, ముందు అబ్బాయి పుట్టాడు. అదే అమ్మాయి పుడితే అది పెద్దయ్యాక నా బ్యాంక్ అక్కౌంట్స్ ఖాళీ అయ్యేవి. తండ్రి అయ్యానన్న ఆనందం ఆవిరైపోయేది" అన్నాడు విజయ్.

అత్తగారు, తల్లి మాటలు విన్నప్పుడు జయశ్రీ ఎంత సంతోషించిందో, తన భర్త మాటలకు అంత కుంగిపోయింది. తన హోదాకు, సిరిసంపదలకూ మాతృదేవతే కారణం, ఆమె కూడా ఆడదే అని మగాడు ఎప్పుడు తెలుసుకుంటాడో అని ఆమెలోని మగువ మనసు గిలగిలలాడింది.

"పోనీలెండి... మళ్ళీ ప్రయత్నించకుండా ఒక బాబుతోనే సరిపెట్టుకుందాం. మీకూ టెన్షన్ ఉండదు" అంది భర్తతో జయశ్రీ.

విజయ్ ఎగిరిగంతేసాడు.

హాస్పటల్‌లో స్పెషల్‌రూమ్‌లో సంభాషణ ఇలా కొనసాగుతుండగా ఒక వ్యక్తి ప్రవేశించాడు.

"సర్ మీకు డాక్టర్‌గారు ఈ కవరు ఇమ్మన్నారు" అన్నాడు విజయ్ చేతిలో ఒక కవరు పెడుతూ. ఆ కవరు అందుకునేటప్పుడు విజయ్ ముఖం దొంగతనం చేసేటప్పుడు రెడ్ హేండెడ్‌గా దొరికిపోయిన దొంగ ముఖంలా ఉంది.

"ఏమిటది?" అన్నారు విజయ్ తల్లి , జయశ్రీ తల్లి, జయశ్రీ ఒకేసారి.

"ఏమీలేదు... ఏమీలేదు..." అనేసి వెంటనే బయటకు వెళ్ళిపోయాడు విజయ్ కంగారుగా.

"అమ్మాయ్! రక్త పరీక్షలేమైనా చేయించారా ఏమిటే బాబుకి?" అంది జయశ్రీ తల్లి.

"ఏం లేదమ్మా" అంది జయశ్రీ.

★ ★ ★

మర్నాడు స్పెషల్ రూమ్‌లో –

"ఎందుకు చేసారీపని?" అసలే ఎఱ్ఱగా యాపిల్ పండులా ఉండే జయశ్రీ ముఖం మరింత కందిపోయింది.

"ఏం చేశాను?" విజయ్ తలవంచుకున్నాడు తప్పు చేసినట్లుగా.

"ఏం చేశారో మీకు తెలియదా"

" – "

"చెప్పండి... బాబుకి డి.ఎన్.ఏ టెస్ట్ చేయించాల్సిన అవసరం ఎందుకు వచ్చింది?"

"ఎందుకైనా మంచిదని చేయించాను".

"అంటే బాబు మీకు పుట్టలేదని మీ అనుమానమా?"

విజయ్ నుంచి సమాధానం లేదు.

"నాకు మగ స్నేహితులు ఉన్నారని చెప్పానుగా... అందుకని మీ మగ బైస్కోపులో నా స్నేహితులతో శృంగారదృశ్యాలు చూసారా? ఛీ... నాకు చాలా సిగ్గుగా ఉంది. ఆనాడు సీతమ్మ తల్లిలాగా అగ్ని ప్రవేశం చేసిగాని, భూమాత ఒడిలోకి వెళ్ళిపోయిగానీ నేను నిర్దోషినని ఋజువు చేసుకుంటానని మీరు అనుకుంటున్నారేమో. నో నెవ్వర్. నేనూ మీతో సమానంగా ఇంజనీరింగ్ చదివాను. వచ్చేనెలలో స్టేట్స్‌కి వెళ్ళే అవకాశం నా ముందు ఉంది."

ఆమె మాటలకు అడ్డువచ్చి విజయ్ –

"నేను... నా అనుమానం..." అతని మాటలు పూర్తి కానివ్వకుండా–

"అత్యంత పవిత్రమైన వివాహవ్యవస్థను మీరు అవమానించారు. మీ మగవాళ్ళల్లో ఎక్కువ శాతం మంది తమ భార్య మాత్రం పవిత్రంగా ఉండాలని కోరుకుంటారు. అదే విధంగా కాబోయే శ్రీమతి మిమ్మల్ని "మీకు గర్ల్‌ఫ్రెండ్స్ వున్నారా" అని అడిగిందే అనుకోండి... జవాబు చెప్తారా సహనంతో?" – ఆమె మాటలకు విజయ్ అడ్డువచ్చి, కోపంతో ఊగిపోతూ...

"జయా! యూ ఆర్ ఎక్సీడింగ్ లిమిట్స్"

"మీరు ఇప్పటికే మీ హద్దులు దాటేసారు. ఇక నేను దాటవలసి ఉంది. నేను నా హద్దులు దాటే పరిస్థితి వచ్చేసింది" అని తన జీవితం ఇలా అయిపోయిందే అన్న బాధ శివుని కంఠంలో నుంచి దిగని గరళంలా గొంతులో బాధిస్తూంటే కొన్ని క్షణాలు మౌనంగా ఉండిపోయింది జయశ్రీ.

విజయ్ గతుక్కుమన్నాడు. కొంపదీసి ఇది గానీ తనని వదిలేయదు గదా... బోలెడు సంపాదన, హేపీలైఫ్ మాయమైపోతుందే అని బాధపడసాగేడు. తన జీవిత నౌక మునిగిపోతుందేమోనన్న భయంతో లంగరు వేయడానికి ప్రయత్నించాడు.

"సారీ జయశ్రీ! నా అనుమానం తీర్చుకోకూడదంటావా?" అన్నాడు.

"నో మోర్ సారీస్ అండ్ రిగ్రెట్స్. విజయ్! నేను మీ ముఖంలోకి చూడలేకపోతున్నాను. ఇక మీ కళ్ళల్లో కళ్ళు పెట్టి భవిష్యత్తులో ఎలా సుఖించగలను?"

"జయా"

"విజయ్! మీకు, మీ విశాల హృదయానికి, మీ కుసంస్కారాల ఆలోచనలకూ నేను బై చెప్పాలనుకుంటున్నాను"

"నాకు ఒక్క అవకాశం ఇవ్వు. మనం ఇద్దరం కూర్చుని మాట్లాడుకుందాం. అపార్థాలు తొలగించుకుందాం" చివరగా ఒక చిన్న ప్రయత్నం చేసాడు విజయ్.

"మిమ్మల్ని నేను బాగానే అర్థం చేసుకున్నాను. మన ఇద్దరి మధ్యా చర్చల అవకాశాలు ఆకాశమంత ఎత్తుకి పోయాయి. దయచేసి నన్ను వొంటరిగా వదిలేసి వెళ్ళిపోండి. ప్లీజ్..." అంది జయశ్రీ తన కుడి చేతి చూపుడువేలు గుమ్మంవైపు చూపిస్తూ–.

ఆమె కళ్ళల్లో నీళ్ళు సునామీలో సముద్రం లాగా పొంగి పొర్లడానికి సిద్ధంగా ఉన్నాయి.

తలవంచుకుని విజయ్ బయటకు వెళ్ళిపోయాడు నెమ్మదిగా. ●